భక్తిగాన లహరి

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రముఖ గాయకుడు త్రినాథరావు భక్తిగాన లహరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. రాజేష్, రామకృష్ణలు వాయిద్యా సహకారం అందించారు. అదే విధంగా శ్రీహనుమత్ కార్యసిద్ధి హోమం నిర్వహించారు.

ప్యాచ్‌వర్క్ పనుల పరిశీలన

ముషీరాబాద్: డివిజన్ పరిధిలోని మోహన్‌నగర్‌లో సీసీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. ఈ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బీఆర్‌ఎస్ నేత పూస గోరక్‌నాథ్ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.

ఆత్మీయ పురస్కారాల ప్రదానం



చిక్కడపల్లి: పురస్కారాలు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో నృత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో కళాకారులకు ఆత్మీయ పురస్కారాల ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ.. సమాజానికి సేవలు అందించేవారిని, ప్రాణాలు నిలిపే వైద్యులను ఎంపిక చేసి వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, శైలజ, శ్రీ గణేశ్, హనుమంతరాయశర్మ , రాధిక, సుప్రియ, మూర్తి, గాంధీ, గీతాంజలి, వంశీ, వైఎస్.రామకృష్ణ, లలిత తదితరులున్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



నల్లకుంట: శ్రీరామ నవమిని వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం న్యూనల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి దేవాలయం ప్రాంగణంలో సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం మ్యూజిక్ టీచర్ యశస్వినిలు ఆలపించిన త్యాగరాజు స్వామి, అన్నమయ్య కీర్తనలు అహూతులను విశేషంగా అలరించాయి. సంగీత కళాకారులకు నూతన దుస్తులు అందజేసి ఆలయం తరపున సన్మానించి, వేద ఆశీర్వచనలు అందించారు. ఈ వేడుకల్లో ఆలయ పాలక మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు, అర్చకస్వాములు అప్పారావు, జ్ఞానేశ్వర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి పది మందిలో ఒకరికి మానసిక వ్యాధి'

చిక్కడపల్లి: దేశంలో ప్రతి పదిమందిలో ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ శ్రీచందన అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలో సంస్థ కార్యక్రమంలో ప్రవర్తన సామాజిక సేవా సంస్థ నిర్వహణలో జరిగిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆమె క్వాంటం హీలింగ్ గురించి అవగాహన కల్పించారు. మానసిక సమస్యలు వల్ల కుంగుబాటు ఆత్రుతతో బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. మానసిక ఒత్తిడి కుంగుబాటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి క్వాంటం హీలింగ్ ప్రత్యామ్నాయ చికిత్స విధానం అని వివరించారు. ప్రవర్తన్ సభ్యులు జేసీఐ హైదరాబాద్ మైత్రి అధ్యక్షుడు హిరణ్మయి సత్యనారాయణ కోణి జేటి తదితరులున్నారు.

రైల్వే కంకరపై పడి వ్యక్తి మృతి

కాచిగూడ: డబీర్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పనులు జరుగుతుండగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కంకరపై పడి మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెదిన సిభానత్ బసు (60) డబీర్‌పురలో రైల్వే లైన్ పట్టాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. పట్టాలపై ఉన్న కంకర అతడి తలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోఘటనలో గుర్తుతెలియని వ్యక్తి..

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) బుద్వేల్ - శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్మిక సంఘాల సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు



కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు

- తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సదస్సు
- మే 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు స్వాతంత్ర్య ఫెడరేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, టీయూసీఐ కార్యదర్శి కె.సూర్యం, బీఆర్‌టీయూ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్‌డీ చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు ఎస్.బాలరాజ్ తదితరులు మాట్లాడారు.

ఏప్రిల్ 10 నుంచి సదస్సులు నిర్వహించాలి..

◆ కార్మిక సంఘాలు అన్ని ఏప్రిల్ 10 నుంచి 20 వరకు జిల్లా సదస్సులు నిర్వహించాలని మే 3వ తేదీలోగా పరిశ్రమలలో సమ్మె నోటీసులు ఇవ్వాలని సూచించారు. పారిశ్రామిక, నివాస ప్రాంతాలలో సదస్సులు నిర్వహించాలన్నారు. బైక్ ర్యాలీలు, సమ్మె పోస్టర్లు విడుదల చేయాలని తీర్మానిచ్చినట్లు వారు తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐయూటీయూసీ నాయకులు భరత్, టీఎస్‌టీయూసీ ఎంకే.బోస్, హెచ్‌ఎంఎస్ నాయకులు రెబ్బ రామారావు, వివిధ సంఘాల నాయకులు నరసింహ, ఎస్ఎల్ పద్మ, ఎం.సాయిబాబు, జె.వెంకటేష్, ఎంటీ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు..

◆ మార్చి 18న న్యూ ఢిల్లీలో జరిగిన నేషనల్ వర్కర్స్ కన్వెన్షన్‌లో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చామని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు.

శ్రీరాముడు అందరికీ ఆదర్శనీయుడు



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు, కళాకారులతో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, వీడీ రాజగోపాల్, డా. వీఎస్ రావు

చిక్కడపల్లి: శ్రీరాముడు అందరికీ ఆదర్శనీయుడని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చిక్కడపల్లిలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన కవులు చదివిన కవితలను విన్నారు. ఈ సందర్భంగా ఏపీ మైన్స్ పూర్వ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ రచించిన 'రమ్యమైనది రామ నామం' పాటని గాయకుడు రవీంద్రబాబు శ్రావ్యంగా ఆలపించారు. ట్యాంక్‌బండ్‌పై వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల సోమన్న 67వ పుస్తకమైన 'అమ్మ ఒడి' పుస్తకాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ ఆవిష్కరించారు. పురాణపండ వైజయంతి రామయణంపై సోదాహరణ ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కృష్ణారెడ్డి, టి.గౌరీశంకర్, సాధనాల వెంకటస్వామి నాయుడు, ఆశాలత, డాక్టర్ వీఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులను గుర్తించేందుకే ఇంటింటి సర్వే

జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి



ముషీరాబాద్: జీవనశైలి మార్పుల వల్ల వచ్చే వ్యాధులను గుర్తించేందుకు నగరంలో నెలరోజుల పాటు ఇంటింటి సర్వేను చేపడుతున్నామని హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నాన్‌కమ్యూనికేబుల్ వ్యాధులను గుర్తించేందుకు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు నెలరోజుల పాటు ఆస్పత్రి పరిధిలోని ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని సూచించారు. దీనిలో భాగంగా బీపీ, మధుమేహం, ఊబకాయం, త్రోట్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యసేవలు అందించేలా కృషి చేయాలన్నారు.

త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ...

నగరంలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చాలా రోజులుగా ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యశాఖ అధికారి డా. మనోజ్‌రెడ్డి, పీహెచ్‌ఎన్‌లు పెల్లిన్, కళావతి, ఏఎన్ఎంలు విజయకుమార్, సునీత, సంతోషిణి, అనురాధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలకు చరమగీతం పాడాలి



సుందరయ్య పార్కు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మార్క్సిస్టు విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి అన్వేష్, పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు హెచ్‌ఎల్. పద్మ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య పార్క్ వద్ద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫాసిస్టు విధానాలకు చరమగీతం పాడాలన్నారు. నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. డీలిమిటేషన్ వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశంలో ప్రజలు అనేక సమస్యలపై పోరాడుతుంటే మోదీ ప్రభుత్వం మాత్రం మత విద్వేషాలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ గ్రేటర్ నాయకులు వి.ప్రవీణ్ పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రదీప్, పీవీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్, గ్రేటర్ నాయకులు రాకేష్, హరీష్ ,లక్ష్మీభాయ్, పుష్ప, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై వాకింగ్‌కు వచ్చి అనంత లోకాలకు..

- యువకుడిని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- చికిత్స పొందుతూ మృతి



సాదుద్దీన్ (ఫైల్ ఫొటో)

కవాడిగూడ: ట్యాంక్‌బండ్ పై వాకింగ్‌కు వచ్చి తిరిగి వెళ్తున్న యువకుడిని గుర్తతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై 'ఐ లవ్ హైదరాబాద్' సింబల్ వద్ద జరిగింది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మల్లేపల్లి ప్రాంతానిక చెందిన మమ్ముద్ సాదుద్దీన్(22) డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే సాదుద్దీన్ ప్రతిరోజు మల్లేపల్లి నుంచి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్‌కు వస్తుంటాడు. మంగళవారం ఉదయం కూడా యథావిధిగా వాకింగ్‌కు వచ్చాడు. ఉదయం 6.05 గంటలకు వాకింగ్ ముగించుకొని ద్విచక్ర వాహనంపై రాణిగంజ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్యాంక్‌బండ్‌పై ఉన్న 'ఐ లవ్ హైదరాబాద్' సింబల్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన సాదుద్దీన్ మొదట గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాదుద్దీన్ తండ్రి సిరాజుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సాదుద్దీన్ మృతదేహానికి పోస్టమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

కుష్టుపై అవగాహన అవసరం

కాచిగూడ: కుష్టువ్యాధి దేవుని శాపం కాదని, సాధారణ చర్మవ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సాధ్యమేనని ప్రభుత్వ కుష్టువ్యాధి ట్రైనింగ్ సెంటర్ ఎస్ఎంఒ డాక్టర్ సుజాత అన్నారు. స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్‌ను మంగళవారం ఎస్ఎంఒ డాక్టర్ సుజాత అధ్వర్యంలో వైద్యసిబ్బంది కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టువ్యాధి పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డైరెక్టర్ రవీంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్లారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. జేఎంఒ డాక్టర్ సుష్మాలక్ష్మి, రాష్ట్ర ఎస్ఎల్ఓ డాక్టర్ జాన్‌బాబు, జీఎల్‌సీటీసీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్: బాపూజీనగర్‌లో ప్రజల సౌకర్యార్థం బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని స్థానిక మహిళలు మంగళవారం కాంగ్రెస్ నగర కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం బాపూజీనగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజ్‌దీప్, కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను వివరించారు. అనంతరం రాజ్‌దీప్ మాట్లాడుతూ.. బాపూజీనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. బస్తీ దవాఖానా ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు జి.ఎస్.చారి, రమేష్‌రాం పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవిత ధర్నా చేయడం సిగ్గుచేటు

ధర్నా స్థలిని ఫినాయిల్‌తో శుభ్రం చేసిన పిడమర్తి రవి తదితరులు



కవాడిగూడ: అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని పెట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధర్నా చౌక్‌లో ధర్నా చేయడం సిగ్గుచేటని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం ధర్నా చౌక్‌లో కల్వకుంట్ల కవిత ధర్నా చేసిన వేదిక, ధర్నాచౌక్ అపవిత్రం అయ్యిందని ఫినాయిల్ పోసి శుద్ధి చేశారు. అనంతరం పిడమర్తి రవి మాట్లాడుతూ... అధికారంలో ఉన్న పదేళ్లలో ఏ ఒక్క రోజు పూలే గురించి మాట్లాడని ఎమ్మెల్సీ కవిత అధికారం పోయిన వెంటనే బీసీ నినాదం, పూలే విగ్రహం అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలనిధర్నా చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఎండలో బీసీ సమాజాన్ని కూర్చోబెట్టి తన కల్వకుంట్ల కుటుంబం మొత్తం ఏసీ గదుల్లో కూర్చున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ ఎత్తేసి ఇప్పుడు అదే ధర్నాచౌక్‌లో ధర్నాకు దిగడం ఏమిటని ప్రశ్నించారు.

బీసీ సమాజం చెవిలో పూలు పెడుతున్నారు...

బీసీ ఉద్యమం పేరుతో యావత్ బీసీ సమాజం చెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కొని తెలంగాణ సిగ్గుపడే విధంగా చేసిన ఎమ్మెల్సీ కవితకు ఇక్కడ ధర్నా చేసే అర్హతలు లేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తుంటే చూసి ఓర్వలేక బీసీల కోసం ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఆవరణంలో పూలే విగ్రహం పెట్టే ముందు 'మీ పార్టీ ఆఫీసులో.. మీ ఇంట్లో పూలే ప్రతిమ పెట్టుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, డాక్టర్ మీసాల మల్లేష్, ఎండీ రహీం, బోరెల్లి, సురేష్, నక్క మహేష్, సాయన్న, వరలక్ష్మి, సాగంటి శేఖర్, మీసాల మహేష్, బొల్గెదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఇప్పుడు గుర్తొచ్చిందా.?

కాచిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో గుర్తుకురాని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ మంగళవారం ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు పూలే విగ్రహాన్ని ఎందుకు పెట్టించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగనే ప్రగతి భవన్‌కు జ్యోతిరావు పూలే భవన్‌గా పేరు పెట్టారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో కుల గణనను చేపట్టి బీసీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. ఇప్పుడు పూలే విగ్రహ ఏర్పాటు పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పగడాల సుధాకర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్లముడి నందగోపాల్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జైల్ భరో'ను విజయవంతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత్ ముక్తి మోర్చా దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యలయంలో మాట్లాడుతూ.. భూమిలో సంపదలో సమాన వాటా లభించాలన్నారు. కులాలవారీగా జనాభా లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. మహనీయులను కించపరిచేల మాట్లాడినా కేంద్రమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలన్నారు. ఈనెల 9న ఉదయం 10గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసనలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీధుల్లో అక్రమ పార్కింగ్‌ను నిరోధించాలి





టీఆర్టీకాలనీలో రోడ్డు పక్కన వాహనాల అక్రమ పార్కింగ్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహ బస్తీ నుంచి టీఆర్టీకాలనీ రైల్వేస్టేషన్ వైపు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా కొందరు తమ వాహనాలను నిలుపుతున్నారు. దీంతో సాయంత్రం చీకటిపడితే చాలు అక్కడికి చేరుకుంటున్న ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మరి కొందరు వాహనాలు పార్కింగ్ చేసిన చోట మూత్రవిసర్జన చేస్తుండడంతో స్థానికంగా సమస్యలు తలెత్తున్నాయి. దీంతో టీఆర్టీ కాలనీ ఇంటి యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్, నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను పరిశీలించారు. రోడ్డు కిరువైపులా వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. మహేష్ కుమార్, ఎస్. నర్సింగరావు, కె. అనిల్‌కుమార్, డేవిడ్ రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆ మూడు పార్టీల నేతలు తోడుదొంగలే..

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



మహాత్మానగర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ... ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దేశవ్యాప్తంగా ప్రజాధరణ ఉందన్నారు. ఇది చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. వక్ఫ్ బిల్లు సవరణ కోసం ఇటీవల పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడితే ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు అడ్డుకున్నాయని అన్నారు. ఈ మూడు పార్టీలు తోడు దొంగలే అని విమర్శించారు.

భూములను రియల్ ఎస్టేట్‌కు దారాదత్తం చేస్తున్నారు...

◆ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు పక్కా గృహాలు ఇస్తామని మాట తప్పిందన్నారు. ఇప్పుడు అదే బాటలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నో భూములను అమ్ముతూ రియల్ ఎస్టేట్‌కు దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి పోలింగ్ బూత్‌లో నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అందుకు కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం , భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, నాయకులు చంద్రమోహన్, నిత్యానంద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..



బాగ్‌లింగంపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని భగత్‌సింగ్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు భారత్‌గౌడ్, రమేష్ రాం, పి.పార్థసారథి, గడ్డం సతీష్, గడ్డం నవీన్, శ్రీనివాస్ నాయిూ, ఉమా మహేష్, రాజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.